## క్లుప్తంగా

### విధుల్లో చేరిన ఆర్టీసీ డిపో మేనేజర్


దేవేందర్

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా ఎం.దేవేందర్ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయన వనపర్తి డిపో నుంచి పదోన్నతిపై కొత్తగూడెం డిపో మేనేజర్‌గా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బాణాల వెంకటేశ్వరరావు హైదరాబాద్ బస్ భవన్‌కు బదిలీ అయ్యారు. దేవేందర్ గౌడ్‌ను ఆర్టీసీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

### డీఎంకు ఘనంగా వీడ్కోలు


వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: ఆర్టీసీ కొత్తగూడెం- ఇల్లెందు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వర్లుకు శనివారం ఇల్లెందులో ఘనంగా వీడ్కోలు పలికారు. డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంజీవరాణి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లను ఆదుకోండి


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఇల్లెందు: వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గందె సదానందం, సీహెచ్ వెంకన్న కోరారు. శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి చేర్చాలని, చెరువులు, కుంటల్లో భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

### అంగన్‌వాడీ బడిబాట

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీ 20వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ మొగిలి లక్ష్మి ప్రారంభించారు. మాతాశిశు రక్షణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. గర్భిణులు, చంటి పిల్లలు, తల్లులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి, ఆర్‌పీ సూర్య, నాగ, సుజాత పాల్గొన్నారు.

### బురదలో బడికెళ్లేదెలా..?


బురదలోనే వెళ్తున్న విద్యార్థులు

టేకులపల్లి: గోలియాతండా పంచాయతీ వాగొడ్డు తండాలోని ప్రాథమిక పాఠశాల ఆవరణమంగా బురదతో నిండింది. ఈ పాఠశాల లోతట్టులో ఉండటంతో వర్షం పడినప్పుడల్లా వరద నీరు చేరి బురదమయంగా మారుతోంది. గతంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పదే పదే చెప్పినా పట్టించుకోలేదు. వర్షం పడితే చాలు విద్యార్థులు బురదలోనే అడుగులో అడుగులేస్తూ తరగతి గదిలోకి వెళ్లాల్సి వస్తోంది. ప్రహరీ లేకపోవడం, గ్రామంలోని మురుగు, వరద పాఠశాలలోకి చేరుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### అత్యవసరమైతేనే బయటకు రావాలి

టేకులపల్లి: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో కాలువలు, వాగుల వద్ద వరద ఉధృతి తీవ్రంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. సరదా కోసమో వాగులు, కాలువల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో పాటు వర్షం పడుతున్న సమయంలో చెట్లు, సెల్ టవర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ఉండొద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. వర్షం, వరద, ఈదురు గాలుల వల్ల ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే 100కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం రుణమాఫీ జరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఫోన్‌కు వచ్చే మెస్సేజ్‌లను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం కార్డు నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితిలోనూ చెప్పొద్దని పేర్కొన్నారు.




కొత్తగూడెంలో రోడ్ల పక్కన జోరుగా సాగుతున్న రెయిన్ కోట్లు, గొడుగుల అమ్మకం

# రెయిన్ కోట్లకు భలే గిరాకీ..

- వర్షాలతో పెరిగిన డిమాండ్
- జిల్లా కేంద్రంలో పెరిగిన దుకాణాలు
- రూ.200 నుంచి రూ.800 వరకు ధర


గొడుగులు పరిశీలిస్తున్న స్థానికులు

సండే స్పెషల్

కొత్తగూడెంఅర్బన్: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన రెయిన్ కోట్లు, గొడుగులకు గిరాకీ పెరిగింది. వర్షం పడుతున్న సమయంలో అత్యవసరంగా పనులపై బయటకు వెళ్లేవారు, ఉద్యోగం, స్కూల్ విద్యార్థులు ఇలా చిన్న పిల్లల నుంచి పెద్దవారు సైతం రెయిన్ కోట్లు, గొడుగులను కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో స్థానిక హెడ్డాఫీసు సెంటర్ మొదలుకొని పోస్టాఫీసు సెంటర్, ప్రకాశం స్టేడియం రోడ్డు పైన, సూపర్‌బజార్, పెద్దబజార్ గణేష్‌టెంపుల్ ఏరియాలలో దుకాణాలు ఏర్పాటు చేశారు. వర్షకాలం నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు రెయిన్ కోట్లు, గొడుగులను తీసుకొచ్చి అమ్ముతున్నారు.

**రకరకాల మోడల్స్..**

రెయిన్ కోట్లు వివిధ రకాల మోడల్స్, కంపెనీలున్నాయి. వాటికి తగ్గట్టుగా వివిధ ధరలలో అమ్మకాలు చేస్తున్నారు. గొడుగులు చిన్న పిల్లలవాడేవి, పెద్దవారికి, ముగ్గురు సరిపడే గొడుగులు కూడా అమ్ముతున్నారు. రూ.200 - రూ.1000 వరకు, రెయిన్ కోట్స్ రూ.400 – రూ.1000 వరకు అమ్మకాలు చేస్తున్నారు.

**ధరలు పెరగలేదు...**



వర్షం నుంచి తడవకుండా రక్షణగా ఉండే రెయిన్ కోట్లు, గొడుగుల ధరలు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెరగలేదు. వర్షాకాలంలో మాత్రమే వినియోగించే వీటి ధరలను పెంచకుండా పాత రేట్లతోనే అమ్మకాలు చేస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గిరాకీ బాగుంది. వినియోదారులు బాగా వస్తున్నారు. – శ్రీనివాస్, వ్యాపారి

**నాణ్యత ఆధారంగా ధర..**



వర్షాకాలం కాబట్టి రెయిన్ కోట్లు, గొడుగులను తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. సీజన్‌ను బట్టి దుకాణాలు కూడా కొత్తగూడెంలో ఎక్కువగా పెరిగాయి. అయితే అన్ని దుకాణాలలో కూడా క్వాలిటీ, కంపెనీని బట్టి వివిధ రకాల ధరలు చెబుతున్నారు. మన బడ్జెట్‌లో మనం తీసుకోవడమే. – వెంకటేష్, కొత్తగూడెం

**వర్షానికి తప్పనిసరి...**



వర్షాలు పడుతున్న నేపథ్యంలో అత్యవసరంగా బయటకు వెళ్లినప్పుడు రెయిన్ కోట్లు తప్పనిసరిగా వినియోగించాల్సిన అవసరం ఉంటుంది. లేకపోతే వర్షంలో తడిస్తే ఆస్పత్రుల్లో రెట్టింపు ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే వర్షం నుంచి రక్షణ పొందేందుకు గాను రెయిన్ కోట్ కొనుగోలు చేస్తున్నాను. – సక్రు, కొత్తగూడెం

# కార్మికులను బదిలీ చేయొద్దు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: అధికారులు, ఉద్యోగులతో పాటు మున్సిపాల్టీలో పని చేస్తున పారిశుద్ధ్య కార్మికులను కూడా బదిలీ చేస్తున్నారని, కార్మికులను బదిలీ చేయొద్దని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... ఇల్లెందు మున్సిపాల్టీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను కొత్తగూడెంకు బదిలీ చేయటం వల్ల కుటుంబపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. తెల్లారుజాము నుంచే రోడ్ల మీద కార్మికులతో పని చేయించాల్సిన వారిని బదిలీ చేస్తే కుటంబాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లటం కష్టంగా ఉంటుందని తెలిపారు. తెలంగాణలో ఎక్కడా పారిశుద్ధ్య కార్మికులను బదిలీ చేయని అధికారులు కొత్తగూడెం జిల్లాలో బదిలీ చేయటం తగదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ, మున్సిపల్ జవాన్ అంజాద్, కార్మికులు లక్ష్మణ్, విక్రమ్, రాణి, రమణ, దుర్గ, యశోద, బాలరాజు, వెంకన్న ఉన్నారు.

# రైతులందరికీ రుణమాఫీ చేయాలి

పాల్వంచ: రాష్ట్రంలో వ్యవసాయ రుణం తీసుకున్న ప్రతీ రైతుకి రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో జిల్లా బ్యారర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారికి కూడా రుణమాఫీ చేయాలన్నారు. డాక్టర్ స్వామినాధన్ కమీషన్ చెప్పిన విధంగా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతన్నలను ఆదుకోవాలన్నారు. అంబయంత్రలక్ష్మి పథకాన్ని పునరుద్ధరించాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్


మాట్లాడుతున్న సైదులు

జూలూరుపాడు: స్థానిక పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. హెచ్‌ఎం బి.నేతాజీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఐఈడీ కోఆర్డినేటర్ సైదులు, టెక్నికల్ విభాగం సతీష్ హాజరయ్యారు. విద్యార్థుల ప్రగతి, బడిబాట నమోదు, పాఠశాల గ్రాంటు, ఖర్చు వివరాలను చర్చించారు. అదేవిధంగా మన ఊరు -మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనుల స్థితిగతులు, శిథిలావస్థ భవనం గురించి మాట్లాడారు. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద నిర్మించిన భవనం 80 శాతం పూర్తయిందని, మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేసి పాఠశాలకు అప్పగిస్తామని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఐఈడీ కోఆర్డినేటర్ సైదులు చెప్పారు.

**ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి..**

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని టీచర్లు కోరారు. శనివారం రాచబండ్లకోయగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. టీచర్లు బి.నరసింహం, సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**సామూహిక అక్షరాభ్యాసం..**

భేతాళపాడు పంచాయతీ రాచబండ్లకోయగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట ముగింపు కార్యక్రమంలో శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ శకుంతల ఆధ్వర్యంలో రాచబండ్ల కోయగూడెం, భేతాళపాడు, చీపురుగూడెం, పంతులుతండా, టాక్యాతండా, రేగళ్లతండా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

**విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం..**

టేకులపల్లి: విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యంగా తల్లిదండ్రులు తమ వంతు కృషి చేయాలని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతిరాణి కోరారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి, పిల్లలకు బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు భవాని, టీచర్ జె.పద్మ, ఐఆర్పీ టీచర్ నీరజ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యా సంస్థలలో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని న్యాయమూర్తి జి.భానుమతి అన్నారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిషేధం'అనే అంశంపై జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ కళాశాల ప్రాంగణం, నోటీస్ బోర్డులో ర్యాగింగ్ నిరోధక హెల్ప్‌లైన్ నంబర్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. ర్యాగింగ్‌ను నిలువరించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు సంబంధిత కళాశాల యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, కొత్తగూడెం షీ టీమ్ ఎస్‌ఐ పి.రమాదేవి, ప్రిన్సిపాల్ కత్తి రమేష్, న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అవినీతిపై చర్యలు తీసుకోండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని, ఇటీవల నిర్వహించిన టెండర్లను రద్దు చేసి తిరిగి టెండర్ల ప్రక్రియ నిర్వహించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్, కొత్తగూడెం మున్సిపాలిటీ సేవ్ కన్వీనర్ జాలాల్ మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన టెండర్లలో కనీస నిబంధనలు పాటించలేదన్నారు. దీనివల్ల మున్సిపాలిటీకి రూ.లక్షల నష్టం వాటిల్లిందన్నారు. మున్సిపాలిటీలో నలుగురు వ్యక్తులు సిండికేట్ అయి ఎవరూ గెలిచినా వారి పంచన చేసి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శించారు. అదేవిధంగా కిన్నెరసాని మంచినీటి కోసం పనులు ప్రారంభం అయ్యే వరకు రహదారులు, కాలువల నిర్మాణాలను నిలిపివేయాలని లేదంటే మళ్లీ రోడ్లను తవ్వాల్సి ఉంటుందని వివరించారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అఖిలపక్ష నాయకులు తెలిపారు. గంధం మల్లికార్జునరావు, వాసం రామకృష్ణ, వీరన్న, తంగెళ్ల లక్ష్మణ్, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

## వరద ముంపు ప్రాంతాలపై దృష్టి పెట్టాలి


పాల్వంచరూరల్: దంతలబోరులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ శంకర్

ఇల్లెందురూరల్: భారీ వర్షాలు కురుస్తున్నందున వరద ముంపునకు అవకాశం ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని ఎంపీఓ చిరంజీవి సూచించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో శనివారం ఆయన పర్యటించి పంచాయతీ కార్యదర్శులకు జాగ్రత్తలు సూచించారు. అంతర్గత రహదారులు, లింకు రోడ్లపై ఉన్న వాగుల ఉధృతిని అంచనా వేసి ప్రజలకు జాగ్రత్తలు సూచించాలని చెప్పారు. శిథిలావస్థకు చేరుకున్న చప్టాలు, కల్వర్టులను పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామాలలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి నీరు తరలిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం తగ్గుముఖం పట్టగానే బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు.

**పంటలను పరిశీలించిన ఏఓ**

పాల్వంచరూరల్: కురుస్తున్న భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. శనివారం నాగారం, సంగం, దంతలబోరు, గంగాదేవిగుప్ప గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్ పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

## సేవాలాల్ సేన మండల కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

టేకులపల్లి: సేవాలాల్ సేన టేకులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని సేవాలాల్ ఆలయంలో జిల్లా కోకన్వీనర్ మాలోతు శివ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాసభలో సేవాలాల్ సేన, అనుబంధ సంఘాల కమిటీని సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ బానోత్ హుస్సేన్ నాయక్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్, జిల్లా కన్వీనర్ హరినాయక్‌లు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా భూక్యా దేవ్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు మల్సూర్, ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి భూక్యా కీమాలాల్, ప్రచార కార్యదర్శి సీతారాం, పవన్, కార్యదర్శి బానోతు నరేష్, కోశాధికారి మాలోతు సుధీర్, గౌరవ అధ్యక్షుడు బానోతు భీముడు, కిషన్ నాయక్, రైతు సేన మండల అధ్యక్షుడు వీరు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యా నరేష్, ప్రధాన కార్యదర్శి జాను నాయక్, ప్రచార కార్యదర్శి జరపల స్వామి, మాలోతు భీముడు, కార్యదర్శి జరపల సంతోష్, అధికార ప్రతినిధి బానోతు రాకేష్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు భూక్యా సాయి నాయక్, ప్రధాన కార్యదర్శి ధరావత్ రామ్ విలాస్, కార్యదర్శి భూక్యా అనిల్, రవి, సురేష్, రాము, మహిళా మండల అధ్యక్షురాలు మాలోతు పార్వతి, ఉపాధ్యక్షురాలు భూక్యా లక్ష్మి, ప్రధాన కార్యదర్శి సోమిలి బాయ్, గౌరవ అధ్యక్షులు మాలోతు కౌసల్య, బుజ్జి, మాలోతు బద్రిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్‌సింగ్, పూల్‌సింగ్, పాపానాయక్, రాందాస్, ధరావతు కృష్ణ, లకావత్తు వంశీ, అజ్మీరా రాము, భూక్యా విజయ పాల్గొన్నారు.

### 27న నూతన చట్టాలపై అవగాహన

కొత్తగూడెంటౌన్: ఈ నెల 27వ తేదీన కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎంఏ హాల్‌లో నూతన చట్టాలపై అవగాహన సదస్సును న్యాయవాదుల కోసం ఏర్పాటు చేయనున్నామని ఐఏఎల్ కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నూతన చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పిస్తామని, సీనియర్ న్యాయవాదులు కేవీఆర్ గుప్త ప్రసంగిస్తారని తెలిపారు.

### షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలంపాట

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబా సెంటర్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన 14 షాపులలో ఏడు షాపులకు బహిరంగ వేలం, మరో ఏడు షాపులు రిజర్వేషన్ ప్రకారం కేటాయించాలని నిర్ణయించినందున ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ బి.యాదగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 27న బహిరంగ వేలం ఉంటుందని వివరాలకు 96663 33359 నంబరులో సంప్రదించాలని కోరారు.

### వైద్యశిబిరం నిర్వహించండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గరీబ్‌పేటలో ఇటీవల వరుస మరణాలు సంభవిస్తున్నాయని ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుకు కలెక్టర్ సుముఖత వ్యక్తం చేసినట్లు జేవీవీ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌కుమార్ మక్కడ్, ఎం.సుబ్బారావు, వెంకటేశ్వరావు, కె.నాగేశ్వరరావు, ఎం.రామలక్ష్మణ్, కె.వీరభద్రం, ఎం.మోహనరావు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని తాటి చాందిని తల్లి నాగమణి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం శనివారం చాందినికి రూ.15,000 ఆర్థిక సాయం అందించారు.

### శాంతి వెల్ఫేర్ ఆధ్వర్యంలో వితరణ

పాల్వంచ: పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీలోని శాంతి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆగాపే పాఠశాలకు నగదు వితరణ చేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వర్ణాంజలి జ్యూవెలరీ, కళాంజలి జ్యూవెలరీ యజమాని ఎన్‌పీ నాయుడు రూ.20 నగదును ప్రిన్సిపాల్ క్రిసోలైట్‌కు అందించారు. కార్యక్రమంలో కొండాడ మల్లేశ్వరరావు, ముగిది శ్రీనివాసరావు, కొంచాడ కృష్ణ, కీర్తి సింహాచలం పాల్గొన్నారు.

### పశువుల వ్యాన్ పట్టివేత

ఇల్లెందు: టేకులపల్లి మండలం బేతంపూడికి చెందిన నరేష్ పశువులను డీసీఎం వ్యాన్‌లో కోదాడకు తరలిస్తుండగా ఇల్లెందు కరెంట్ ఆఫీస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వివరాలు... 36 శాల్తీల పశువులను తరలిస్తున్న డీసీఎం డ్రైవర్ అరవింద్‌తో పాటు నరేష్ మీద కేసు నమోదు చేసి పశువులను గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి, ఏఎస్‌ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

### సైబర్ కేసు నమోదు..

ఇల్లెందు: బాలాజీనగర్‌కు చెందిన రాజశేఖర్ రూ.50 వేలు యాప్‌లో రుణానికి అర్హత సాధించారంటూ ఓ ఫోన్ కాల్ వచ్చింది. రుణం కావాలంటే ఆధార్, పాన్ కార్డు పంపించాలని, వెంటనే రుణం మంజూరు చేస్తామని కోరారు. రుణం పొందాలంటే పేపర్ ఖర్చు రూ.7 వేలు చెల్లించమని కోరారు. ఇలా పలు దఫాలుగా వివిధ ఖర్చుల పేరుతో రాజశేఖర్ నుంచి మార్చి 4వ తేదీ నుంచి రూ.47 వేలు స్వాహా చేశారు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచాఫ్ చేశారు. ఈ మేరకు రాజశేఖర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ బత్తుల సత్యనారాయణ కేసును పర్యవేక్షిస్తున్నారు.